సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం । 5 । జూన్ । 2023



అమ్మడానికి అష్టకష్టాలు

వరిధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



కల్యాణం.. కమనీయం

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.2 /28.4

వాతావరణం

రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నైపుణ్యం సాధించిన వారికి ప్రోత్సాహం



గద్వాల: వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో నైపుణ్యం సాధించిన ప్రతి క్రీడాకారుడికి తన వంతుగా ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గత నెల రోజులుగా స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన కబడ్డీ వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణా శిబిరాలలో నైపుణ్యం సాధించిన చాలామంది క్రీడాకారులకు కోచ్, సీనియర్ క్రీడాకారులు నిరంతరం శిక్షణ ఇచ్చారన్నారు. ఫలితంగా పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించారని చెప్పారు. కబడ్డీ శిక్షణా శిబిరంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గద్వాల కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అబ్రహం, స్టేడియం ఇన్‌చార్జ్ జితేందర్, కోచ్ రజనీకాంత్, సీనియర్ క్రీడాకారులు తిరుపతి, నర్సింహా, రాము, సురేష్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

గద్వాల రూరల్: ఈ నెల 12వ తేదీన జిల్లాలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ గద్వాలకు రానున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు గద్వాల నియోజకవర్గం నుంచి ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భారీ బహిరంగ సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జమ్ములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్, కౌన్సిలర్లు నరహరిగౌడ్, పార్టీ నాయకులు గోవిందు, ధర్మనాయుడు, కురుమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల మార్కెట్

- జిల్లా కేంద్రంలో 2.30 ఎకరాల్లో నిర్మాణం
- రూ.12 కోట్లు మంజూరు.. మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం
- గద్వాలకు తలమానికం కానున్న సమీకృత మార్కెట్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వివరాలిలా..
మార్కెట్ నిర్మించే స్థలం: 2.30ఎకరాలు
నిర్మాణానికి మంజూరైన నిధులు రూ. 12 కోట్లు
కమర్షియల్ బ్లాక్‌లో దుకాణాలు: 34
వెజిటేరియన్ బ్లాక్‌లో దుకాణాలు : 107
నాన్‌వెజ్ బ్లాక్‌లో దుకాణాలు : 46
ఫిష్ బ్లాక్‌లో దుకాణాలు : 39

గద్వాల న్యూటౌన్: జిల్లా కేంద్రమైన గద్వాలలో ఇంటిగ్రేటెడ్ (సమీకృత) మార్కెట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ మార్కెట్ యార్డు ఖాళీ స్థలంలో 2.30 ఎకరాల్లో అధునాతనంగా మార్కెట్‌కు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.12 కోట్లు మంజూరు అయ్యాయి. మరో రూ.6.50కోట్లకు ప్రతిపాదనలు నివేదించారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి అయ్యి మార్కెట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కూరగాయల నుంచి అన్నీ ఒకేచోట..

గద్వాల పట్టణం జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి పల్లెప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి, విద్య రంగాల కోసం చాలా మంది పట్టణానికి వచ్చి స్థిరపడుతున్నారు. పట్టణం నలువైపులా పెరిగిపోతోంది. ఈక్రమంలో ప్రజలు తగ్గట్టుగా సౌకర్యాలు లేవు. ప్రధానంగా ప్రత్యేకంగా కూరగాయల, మటన్, ఫిష్ మార్కెట్‌లు ఒక్కొక్కటే చిన్నవిగానే ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని గద్వాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం కేటాయించి, మంజూరి ఇప్పించాలని నాలుగేళ్ల క్రితం స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీంతో స్థల సేకరణ ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. ఈక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో సువిశాలమైన ఖాళీ స్థలాన్ని గుర్తించి, ఆ వెంటనే స్థలసేకరణ జరిపించారు. నిర్మాణానికి అవసరమైన 2.30 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. నిర్మాణం కోసం అవసరమైన నిధులను స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రూ. 12 కోట్లు విడుదల చేయించారు. మరో రూ.6.50 కోట్లకు ప్రతిపాదనలు నివేదించారు.



“ మూడు నెలల్లో పూర్తి చేస్తాం

గద్వాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. బ్లాక్‌ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. నాణ్యతగా పనులు చేపడుతున్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి అయి అందుబాటులోకి రానుంది.

– పుష్ప, జిల్లా మార్కెటింగ్ అధికారి

తలమానికం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గద్వాల పట్టణానికి తలమానికంగా మారనుంది. జనాభా ఏటా పెరుగుతోంది. పట్టణ శివారులో కొత్త కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. ప్రజలకు అన్ని ఒకే చోట లభించే మార్కెట్ ఇక్కడ లేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు అయితే అందులోనే ప్రజలకు అన్ని లభిస్తాయి. కూరగాయలు, నాన్‌వెజ్‌లో అన్నిరకాలతో పాటు, సూపర్‌మార్కెట్, కమర్షియల్ దుకాణాల వల్ల ఇక్కడే అన్ని రకాల నిత్యవసర వస్తువులు, సరుకులు కొనుగోలు చేయవచ్చు. మార్కెట్‌ను యార్డులో నిర్మిస్తుండటం వల్ల చాలా కాలనీల ప్రజలకు రవాణా పరంగా సౌకర్యంగా ఉంటుంది. మార్కెట్ అందుబాటులోకి వస్తే ప్రజలకు పలు రకాల వస్తువులు, వెజ్, నాన్‌వెజ్ ఒకే చోట లభించనున్నాయి.

చకచకా పనులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గడిచిన 2021 సెప్టెంబర్ 14వ తేదీన శంకుస్థాపన చేశారు. 2022 ఫిబ్రవరి మొదటివారంలో లాంఛనంగా పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని అత్యంత అధునాతనంగా డిజైన్ చేశారు. ఐదు అంతస్తులతో నిర్మాణం చేస్తున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలంతో బ్లాక్ వైస్‌గా కూరగాయలు, మటన్, ఫిష్, దుకాణాలతో పాటు, సూపర్ మార్కెట్, బేకరి, కమర్షియల్ దుకాణాలు వేరువేరుగా నిర్మిస్తున్నారు. ఇందులోనే అడ్మిన్ కార్యాలయం ఉంది. ఇప్పటికే నాన్‌వెజ్, వెజిటేబుల్, కమర్షియల్ బ్లాక్‌ల నిర్మాణాలతో 70ఐదు శాతం పనులు పూర్తి అయ్యాయి. ఫ్లోరింగ్, విద్యుత్ తదితర పనులు చేయాల్సి ఉంది. మరో మూడు నెలల్లో నిర్మాణం పూర్తి అయి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



నిర్మాణంలో కమర్షియల్ బ్లాక్

పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అండ



డబుల్ బెడ్‌రూం ఇళ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే అబ్రహం

- ‘గృహలక్ష్మి’ పథకంతో రూ.3లక్షల సాయం
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- క్యాతూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, రైతు వేదిక ప్రారంభం

జోగుళాంబ శక్తిపీఠం: పేదలందరికీ సొంతిళ్లు నిర్మించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొస్తుందని.. మరో రెండు వారాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని.. సొంత స్థలం ఉన్న వారికి విడతల వారీగా రూ.3లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అలంపూర్ మండలం క్యాతూరులో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25కోట్లతో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, రూ.22లక్షలతో నిర్మించిన రైతు వేదిక ప్రారంభానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే, రైతువేదికను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంతో పేదలకు మరిన్ని ఇళ్లు రాబోతున్నాయని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు కాబోతున్నాయని, మరో రెండు మూడు వారాలలో ఈ ప్రకియ ప్రారంభం కానుందన్నారు. అలాగే, జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్‌కి మంత్రి సూచించారు. దశాబ్ది ఉత్సవాల ద్వారా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని, రైతు వేదిక నిర్మాణాలతో ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందించి దళారుల భారి నుంచి కాపాడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి అవకాశం ఇచ్చి కేసీఆర్ రాజ్యం తీసుకురావాలన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. రైతువేదికల ద్వారా రైతులకు సాగు సలహాలు, సూచనలు అందించేందుకు వీలవుతుందని, 6వేల ఎకరాలకు ఒక రైతు వేదిక నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎంపీపీ బేగం, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ విక్రమ్‌సేనారెడ్డి, సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ అనురాధ, జెడ్పీటీసీ రాజు, మున్సిపల్ చైర్మన్ సంధ్యామనోరమ, ఏడీఏ సక్రియానాయక్ పాల్గొన్నారు.

రేపు కందనూలుకు సీఎం రాక



నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ భవనం

- సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం
- జిల్లాకేంద్రం శివారులో భారీ బహిరంగ సభ నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మంగళవారం కందనూలుకు రానున్నారు. జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో రూ.53 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవన సముదాయం, ఎస్పీ కార్యాలయాలతోపాటు దేశిఇటిక్యాల శివారులో నిర్మించిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాలను ఆయన ప్రారంభించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి నాగర్‌కర్నూల్ శివారులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ సమీపంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు సీఎం కేసీఆర్ జిల్లాకేంద్రానికి చేరుకునే అవకాశం ఉంది. సీఎం పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేస్తోంది. కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్ ఏర్పాట్లపై నిరంతరం సమీక్షిస్తున్నారు.

జన సమీకరణపై దృష్టి..

నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, బీఆర్‌ఎస్ కార్యాలయాల ప్రారంభోత్సవాల అనంతరం సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఇందుకోసం జిల్లాకేంద్రం శివారులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ పక్కన ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సభాప్రాంగణాన్ని చదును చేసే పనులు రాత్రి, పగలు తేడా లేకుండా జరుగుతున్నాయి. బహిరంగ సభకు సుమారు లక్ష మందికిపైగా జనాన్ని సమీకరించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు కృషిచేస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేందుకు ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తమ తమ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో జనాన్ని సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో దిక్కు సీఎం సభకు రెండు రోజుల ముందు నుంచే జిల్లాకేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు, బ్యానర్లతో పట్టణమంతా గులాబీమయమైంది.



బహిరంగ సభా ప్రాంగణంలో కొనసాగుతున్న పనులు

బసవన్న రాజసం.. రైతన్న సంబరం

రంగు రంగుల కాగితాలతో ఎద్దుల అలంకరణ.. డోలు చప్పుళ్లు.. చిన్నారుల కేరింతలు.. కాడెద్దుల ఊరేగింపులతో ఏరువాక సంబరాలు అంబరాన్నంటాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి సూచికగా పల్లెల్లో రైతులు సంబరంగా నిర్వహించుకునే సంప్రదాయ పండుగ ఏరువాక. ఆదివారం రైతులు వ్యవసాయ పనుల్లో తమకు చేదోడువాదోడుగా ఉంటున్న ఎద్దులకు రంగులద్ది, అలంకరణలతో సింగారించి వాటికి పూజలు చేశారు. వానాకాలం సాగు పనులు నిర్విఘ్నంగా సాగాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాలు కిక్కిరిశాయి. ఆయా ఆలయాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- గద్వాల



ఏరువాక పౌర్ణమిలో భాగంగా గట్టులో కాడెద్దుల ఊరేగింపు

జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలి

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తున్నట్లు గతంలో చెప్పారని, ఆమేరకు జిల్లాకు కూడా మెడికల్ కళాశాల మంజూరు చేయాలని మెడికల్ కళాశాల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఏడాదిలోనే జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి తరగతులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో మధుసూదన్ బాబు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకటస్వామి, ఆంజనేయులు, రాజు, వాల్మీకి, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌బాబు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- పోలీస్ శాఖలో నూతన సంస్కరణలు నవశకానికి నాంది
- సురక్ష దినోత్సవ ర్యాలీలో ఎస్పీ సృజన
- అట్టహాసంగా కలరిపయట్టు యుద్ధ విన్యాసాలు



జిల్లా కేంద్రంలో పోలీసుల సురక్ష దినోత్సవ ర్యాలీ

గద్వాల క్రైం: ప్రత్యేక రాష్ట్రం, జిల్లా ఏర్పాటు తర్వాత పోలీస్ శాఖలో నూతన సంస్కరణలు నవశకానికి నాంది పలికాయని, హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి నేర నియంత్రణలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ సృజన అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లాలోని ప్రధాన చౌరస్తాల మీదుగా పెట్రో కార్స్, బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నో కేసులను చేధిస్తూ సంఘవిద్రోహులు, అక్రమ వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులను నిలువరించామని, చట్ట వ్యతిరేక కార్యకలపాలపై ఉక్కుపాదం మోపామన్నారు. రూ.25కోట్లతో నూతన ఎస్పీ కార్యాలయాన్ని పూర్తి చేశామని, పలు నూతన పోలీస్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. అనంతరం భరోసా సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేలు కృష్ణమోహన్ రెడ్డి, అబ్రహం, మున్సిపల్ చైర్ పర్సన్‌లు కేశవ్, కరుణశ్రీ, డీఎస్పీలు రంగస్వామి, ఇమ్మానియేల్, సిఐలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

ఆకట్టుకున్న ‘కలరిపయట్టు’ విన్యాసాలు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కలరిపయట్టు యుద్ధ విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన నిత్య చైతన్య కలారి అకాడమీ వారు విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతరించిపోతున్న ఇలాంటి కళల గురించి ప్రజలకు తెలియపర్చడం అభినందనీయమని, ఏ ఆయుధం లేకుండా ప్రత్యర్థిని నిలువరించాలనే లక్ష్యంతో ఈ యుద్ధ కళ ప్రాచూర్యం పొందిందన్నారు.



కలరిపయట్టు యుద్ధ విన్యాసం

అటవీ చట్టాన్ని తుంగలో తొక్కారు

- భూ సేకరణ చేయకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారు?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క

అచ్చంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కి పోడు భూములు లాక్కుంటుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం అచ్చంపేట మండలం రంగాపూర్ చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సిద్ధించి పదేళ్లు గడుస్తున్నా నేటికీ అమరుల ఆకాంక్షలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌కు కనీసం భూ సేకరణ చేయకుండా ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమం పూర్తిగా నిర్వీర్యమైందని, కనీసం ఐటీడీఏ పీఓ లేకపోవడంతో రూ.150 కోట్ల నిధులు వెనక్కి వెళ్లాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను అగ్గిపెట్టెలుగా అభివర్ణించిన సీఎం కేసీఆర్ హౌసింగ్ కార్పొరేషన్‌ను ఎత్తివేశారని, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, డీఎస్సీ, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఊసే లేదని, కేసీఆర్ పరిపాలనలో వచ్చిన కొలువుల కంటే తొలగించిన కొలువులే ఎక్కువ అని విమర్శించారు. 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేస్తానని చెప్పి 30 వేలకు ఇచ్చారని, వాటిలోనూ పేపర్ లీక్‌తో యువత భవిష్యత్‌ను అంధకారంలో పడేశారని దుయ్యబట్టారు. పదో తరగతి పరీక్షలను సైతం సమర్థవంతంగా నిర్వహించలేని చేతగాని ప్రభుత్వం అన్నారు. అచ్చంపేటకు సాగునీటి విషయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని, కేవలం ఎన్నికల కోసమే తెరపైకి తెస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్‌కు కేఆర్‌ఎంబీ ఆమోదం చేసిందా.. నీళ్ల కేటాయింపులు జరిగాయా.. పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు వచ్చాయేమో చూపిస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయనని గువ్వలకు సవాల్ విసిరారు. అచ్చంపేట ప్రజలు పాము పడగ నీడలో ఉన్నట్లు భయంతో బతుకుతున్నారని, బాలరాజు నరకాసురుడు లాంటివాడని, ఆయనను అచ్చంపేట నుంచి పంపిన రోజే ప్రజలకు నిజమైన దీపావళి అన్నారు. పాదయాత్ర పొడవునా భట్టి రైతులతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. అలాగే బొల్గట్‌పల్లి స్టేజీ వద్ద లెనిట్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, చంద్రమోహన్, రామనాథం, సర్పంచ్ లచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో మే 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోయ కృష్ణ (42) ఈ నెల 3న అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. కర్నూలులోని బుధవార్‌పేటకు చెందిన బోయ కృష్ణ, సురేష్ బైక్‌పై బీచుపల్లి ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని కింద పడగా ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన విషయం పాఠకులకు విదితమే. సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చిరుత దాడిలో లేగదూడ..

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ శివారు ఎర్రమన్నుగుట్ట సమీపంలో పశువుల పాకలో కట్టేసిన ఆవు దూడపై చిరుత దాడిచేసి చంపేసింది. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు పాత్లావత్ రాజు దూడ చనిపోయి ఉండటాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ ఫారెస్టు బీట్ అధికారి శశికళ ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత దాడితో చుట్టుపక్కల పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు..

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో ఆదివారం సాయంత్రం కుక్కలు దాడిచేసి 18 గొర్రె పిల్లలను చంపేశాయని కాపరులు తెలిపారు. మిగిలిన 10 పిల్లలు కనబడుట లేదని పేర్కొన్నారు. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కాపరులు నర్సింహ, వెంకటరమణ, రాముడు కోరారు.

'ఏం సాధించారని సంబరాలు'



పాలమూరు: రాష్ట్రంలో సురక్ష దినోత్సవం ప్రజల కోసం కాకుండా.. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల కోసం అని చెప్పుకొని జరిపితే బాగుండేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మానసికంగా ఎంతో ఒత్తిడికి గురిచేస్తుందన్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థను పార్టీ కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ హామీలను ప్రశ్నిస్తే బీజేపీ నేతలపై కేసులు పెట్టడం, అరెస్టు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎందరో మహిళల హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయడం లేదని, ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం సాధించారని మీరు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలు పాల్గొనకుండా అధికారులపై పాయింట్ బ్లాక్‌లో గన్‌పెట్టి సంబరాలు జరుపుతున్నారని విమర్శించారు. నాయకులు పద్మజారెడ్డి, అంజయ్య, నారాయణయాదవ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం



బిచ్చారావు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: బడిబాట కార్యక్రమానికి వెళ్తున్న ఓ ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన పుర పరిధిలోని ఎండబెట్ల సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. పెంట్లవెల్లి మండలం కొండూరుకు చెందిన బిచ్చారావు (50) నాగర్‌కర్నూల్‌లోని హౌజింగ్‌బోర్డుకాలనీలో నివాసం ఉండి తాడూరు మండలం మేడిపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవాడు. బడిబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం బైక్‌పై మేడిపూర్‌కు వెళ్తుండగా ఎండబెట్ల సమీపంలో పంది అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బిచ్చారావుకు భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

దేవరకద్రలో యువకుడు..



నర్సింహ (ఫైల్)

దేవరకద్ర: మండల కేంద్రం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం మేరకు.. మండలంలోని డోకూర్‌కు చెందిన నర్సింహ (45) మహబూబ్‌నగర్ వైపు నుంచి దేవరకద్రకు బైక్‌పై బయలుదేరాడు. దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న కారు పట్టణ సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి బైక్, కారును రోడ్డు పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించినట్లు వివరించారు.

అమ్మడానికి అష్టకష్టాలు

- రేయింబవళ్లు ధాన్యం వద్దే రైతుల పడిగాపులు
- వర్షానికి తడిసి మొలకెత్తుతున్న ధాన్యం
- మార్కెట్‌లో తక్కువ ధరకే అమ్ముకుంటున్న వైనం
- లారీల సమస్యలతో సతమతం



జడ్చర్ల పత్తి మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం కుప్పలు

జడ్చర్ల: ఆరుగాలం నానా ఇబ్బందులు పడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. యాసంగి కాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం దిగుబడులు వచ్చి రెండునెలలు గడుస్తున్నా నేటికీ ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. ప్రధాన రహదారులు తదితర ఖాళీ స్థలాల్లో నిల్వ చేసిన ధాన్యం కుప్పల వద్దే రోజుల తరబడి రైతులు ఎండకు, వానకు పడిగాపులు గాస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సహకార సంఘాలతో పాటు ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. కానీ అనేక ఇబ్బందులతో రైతులు సతమతమవుతున్నారు.

తూకాల్లో కటింగ్..

ధాన్యం తూకం వేసే సమయంలో క్వింటాలుకు కిలోవరకు తరుగు తీయడంతో పాటు మిల్లులకు తరలించిన సమయంలో క్వింటాలుకు మరో రెండు మూడు కిలోల వరకు తరుగును తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. తరుగు హమాలీల ఖర్చు, తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతాంగం పేర్కొంటుంది. క్వింటాలుకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నా ఆయా ఖర్చులు, తరుగును లెక్కిస్తే బయటి మార్కెట్‌లో లభిస్తున్న ధరలే గిట్టుబాటవుతున్నాయని పేర్కొంటున్నారు.

వేధిస్తున్న తేమ శాతం..

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తేమశాతం ఎక్కువగా ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. పంట కోత సమయంలో దాదాపు 30 శాతానికి పైగా ఉన్న తేమను తగ్గించేందుకు రైతులు ధాన్యాన్ని రోడ్లు, కల్లాలు తదితర ప్రాంతాలలో ఆరబెట్టడం, శుద్ధిచేయడం చేస్తున్నారు. అయితే వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మార్పు చెందడం, మబ్బులు కమ్ముకోవడం తదితర కారణాలుగా తేమ శాతం త్వరగా తగ్గడం లేదు.ఫలితంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా రోజుల తరబడి పొలం పనులు మానుకుని కాపుగాసే దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు..

ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. రోడ్లు, పొలాలు, మార్కెట్ ఆవరణలు, తదితర మైదాన ప్రాంతాలలో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొందరైతే ఇబ్బందులు భరించలేక ఎంతకో అంత అన్నట్లుగా బాదేపల్లి యార్డుకు తరలించి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో బాదేపల్లి మార్కెట్‌లో ఇప్పటివరకు దాదాపు లక్ష బస్తాలకు పైగా ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించారు.

అంతంత మాత్రంగానే ప్రభుత్వ కొనుగోళ్లు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అంతంత మాత్రంగానే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.జడ్చర్ల మండలంలో ఇప్పటి వరకు కేవలం 40 వేల బస్తాలకు మించి కొనుగోలు చేయలేదు. మరో 40 వేల బస్తాల ధాన్యం రైతుల వద్దే మిగిలి ఉన్నట్లు అంచనా. అదేవిధంగా మిడ్జిల్ మండలంలో లక్ష బస్తాల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేయగా మరో 50వేల బస్తాల ధాన్యం బయట ఉన్నట్లు తెలుస్తుంది. బాలానగర్, రాజాపూర్ మండలాల్లోని పీఏసీఎస్ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 12వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. ఆయా మండలాల్లో దాదాపు 50వేల బస్తాల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు అంచనా.

లారీలు రాక రైతుల గోస..

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసేందుకు రోజులు తరబడి పడిగాపులు పడుతున్నారు. కొనుగోలు తర్వాత తూకాలు వేసిన బస్తాలను లారీలలో సంబంధిత రైస్ మిల్లులకు పంపడం కూడా రైతుల బాధ్యతగా చెప్పడంతో లారీల రాక కోసం మరికొన్ని రోజులు బస్తాల దగ్గర కాపలా ఉండే పరిస్థితి నెలకొంది.ఇలా మొత్తం మీద ధాన్యం అమ్మడానికి నెల రోజులు పడుతుందని రైతులు వాపోతున్నారు.

అష్టకష్టాలు..

రైతులు ధాన్యన్ని ఆరబెట్టి కుప్పల వద్దే రాత్రీపగలు పడిగాపులు గాస్తున్నారు. వర్షం వచ్చిన సమయంలో మరీ ఇబ్బందులు పడుతున్నారు.వర్షానికి తడిచిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టడం తదుపరి కుప్పలు కట్టడం, బస్తాలకు ఎత్తడం,తదితర వ్యయ ప్రయాసాలకోర్చడం రైతులకు తలనొప్పిగా మారింది. ఎక్కువగా రోడ్లపై ఆరబెడుతుండడంతో ప్రమాదం పక్కనే ఉన్నట్లుగా గడపాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షాలతో ఆందోళన..

అకాల వర్షాలు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తుంది.ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉందని రైతులు పేర్కొంటున్నారు. వర్షానికి ధాన్యం మొలకెత్తుతుందన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడం ఆకస్మికంగా వర్షం రావడంతో కుప్పగట్టడం వంటి పనులు చేసేందుకు కుటుంబ సభ్యులమంతా ధాన్యం కుప్పలవద్దే ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కలెక్టర్, తదితర పాలకులు స్పందించి ధాన్యం తరలింపును వేగవంతం చేయకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు. త్వరగా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

20రోజులుగా కుప్ప వద్దే..



జడ్చర్ల పత్తి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్ప వద్దే 20 రోజులుగా ఉన్నాను. తూకాలు వేసినా బస్తాల దగ్గరే ఉండాల్సి వస్తుంది. అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు తడిసి నష్టం వాటిల్లుతుంది.

– చెన్నయ్య, రైతు,గంగాపూర్

ఇబ్బంది పడుతున్నాం..



ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాము. ధాన్యం ఆరబెట్టడం, వర్షానికి తడిసి ముద్దవడంతో మరిన్ని రోజులు కుప్పల వద్దే పడిగాపులు పడాల్సి వచ్చింది. రాత్రీ పగలు తేడా లేకుండా నెల రోజులుగా కుప్పల వద్దే ఉండడంతో వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నాము. తూకం వేసిన బస్తాలను మిల్లుకు తరలించేందుకు లారీలు రాకపోవడంతో దిక్కు తోచడం లేదు.

– వెంకటయ్య, రైతు, నెక్కొండ

చర్యలు తీసుకుంటున్నాం..



ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నాము. సమస్యలను అధిగమించి రైతులకు ఇబ్బందులు రాకుండా చేస్తున్నాము. అన్ని కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశాము. కానీ లారీలు సకాలంలో రాకపోవడం, మిల్లుల దగ్గర సకాలంలో అన్‌లోడ్ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– యాదగిరి, సీఈఓ, పీఏసీఎస్, బాదేపల్లి

ధాన్యం త్వరగా తరలించాలి

- 167 నంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో

జడ్చర్ల: ధాన్యం కొనుగోలు అనంతరం తమ ఇబ్బందులను పరిష్కరించాలంటూ బాధిత రైతులు ఆందోళన బాటపట్టారు. ఆదివారం జడ్చర్ల పత్తి మార్కెట్‌యార్డు ఎదుట 167 నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. దాదాపు 2గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయాలని, వ్యాపారులు తరుగు ఎక్కువగా తీయకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రైతులకు ఫోన్‌లో నచ్చజెప్పడంతో శాంతించారు. అనంతరం స్థానిక సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో లారీలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత లారీ అసోసియేషన్‌తో చర్చించారు.



జడ్చర్ల-కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



రాస్తారోకోతో 167 నంబర్ జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ప్రతాప రుద్రుని కోటపైన ట్రెక్కింగ్

మన్ననూర్: నల్లమల ముఖద్వారంలోని ప్రతాప రుద్రుని కోట పైభాగంలో అచ్చంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అధ్యక్షుడు లావుడ్యా చందునాయక్ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్ ఒక్కటే శరణ్యం అని అన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలన్నారు. అచ్చంపేటలో ప్రతి నిత్యం వాకింగ్ చేసే సుమారు 70మంది ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు కోటపైకి ట్రెక్కింగ్ సుమారు రెండుగంటల పాటు చేశారని తెలిపారు. ప్రకృతి ఒడిలో మార్నింగ్ వాక్ ఒక అనుభూతిగా ఉందని వాకర్స్ అభిప్రాయం వ్యక్తంచేశారు. పీడీ నాగేశ్వర్‌రావ్, జీహెచ్‌ఎం శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, రామకృష్ణ, నర్సింహ, భగీరథ్‌నాథ్, రాములు, నీరంజన్, గూప్లా, బీచ్యా, యాదగిరి గణపతి, ఖదీర్, భాస్కర్, స్వామినాథం, శరణ్‌గౌడ్, ఏఈ ఆంజనేయులు, డాక్టర్ లింగాచారి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ప్రతాప రుద్రుని కోటపై ట్రెక్కింగ్ చేసిన అచ్చంపేట వాకర్స్

కన్నీటి సంద్రమైన కప్పెట



మహేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు

భూత్పూర్: అమెరికాలో గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన బోయ మహేష్ మృతిచెందిన విషయం పాఠకులకు విధితమే. 12 రోజుల తర్వాత కార్గో విమానంలో మహేష్ మృతదేహం శనివారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాగా.. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. మహేష్ మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు, ఆప్త మిత్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. చేతికొచ్చిన కుమారుడు ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అయిదు నెలల్లోనే శవమై తిరిగొచ్చాడని తండ్రి వెంకట్రాములు కన్నీటి పర్యంతమయ్యారు.

పరిశ్రమల రాకతో అభివృద్ధి

అడ్డాకుల: పరిశ్రమల రాకతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం వేముల రైతు వేదికలో ఆదివారం రాత్రి వేముల, దాసర్‌పల్లి, నందిపేట, తుంకినీపూర్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న సీఎం కేసీఆర్ పర్యటనతో పాటు 8న మంత్రి కేటీఆర్ వేముల ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమకు రానున్నట్లు చెప్పారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనతో ఎస్‌జీడీ ఫార్మా వద్ద రూ.500 కోట్లతో మరో కొత్త ప్లాంట్ ఏర్పాటు కానుందన్నారు. నియోజకవర్గానికి పరిశ్రమలు వస్తుండటంతో ఈ ప్రాంత యువతకే ఎక్కువ ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.

సాగులో లద్దెపురుగుతో జాగ్రత్త

- వేసవిలో లోతు దుక్కీలు అవసరం
- నత్రజని ఎరువులను అతిగా వాడొద్దు
- ఎకరం పైరులో వంద ఆముదం మొక్కలు
- లింగాకర్షన బుట్టలు, పక్షి స్థావరాలు అవసరం



అముదం పంట ఆకు మీద పొగాకు లద్దె పురుగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంటసాగులో లద్దె పురుగు ఆశించి పంటకు తీవ్రనష్టం కలిగిస్తాయి. ఈ పురుగు ఆశించికుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. రెక్కల పురుగు లేత గోధుమ రంగులో ఉండి ముందు మచ్చ రెక్కలు కలిగి ఉంటాయి. తల్లి పురుగులు ఆకులపై వందల గుడ్లను గుంపులో పెట్టి వాటిపై గోధుమ వర్ణం కలిగిన నూగుతో కప్పుతాయి. ఒక్కొక్క తల్లి పురుగు తన జీవిత కాలంలో వెయ్యికిపైగా గుడ్లను పెడుతుంది. పంట కాలంలో పండించే వివిధ పంటలైన వరి, ఆముదం, పొగాకు, కంది, పప్పుశనగ, పెసర, మినుము, కూరగాయల పంట టమాట, వంగ, బెండ, మిరప పంటలకు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. పొగాకు లద్దె పురుగు వివిధ పంటల్లో ఆశించి రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తాయని ఏడీఏ వివరించారు.

తొలి దశలో..

తొలిదశలో చిన్న గొంగళి పురుగులు ఆకుల మీద పత్రహరిత పదార్థాన్ని గీకి తిని జల్లెడ ఆకులుగా మారుస్తాయి. పెద్ద పురుగులు ఆకులను కొరికి తిని నెలను మాత్రమే మిగిలిస్తాయి. పూత మొగ్గలు, కాయలను ఆశించి లోపలి పదార్థాలను తిని నష్టపరుస్తాయి. ఎదిగిన గొంగళి పురుగులు పగలంత నేల మీద, చెత్త కింద, మట్టి పెళ్లల కింద, నెర్రల్లో దాగి ఉండి రాత్రిళ్లు పైరుపై ఆశించి విపరీతంగా నష్టపరుస్తాయి. రైతులు మొదట గుడ్ల సముదాయాలను, జల్లెడ ఆకులను చిన్న చిన్న గొంగళి పురుగుల గుంపులను బట్టి పురుగు ఉనికి గమనించవచ్చు. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఈనెలు మాత్రమే ఉన్న ఆకులను చెట్ల మొదళ్లలో పగటి పూట దాగి ఉన్న నునుపైన పెద్ద గొంగళి పురుగులను బట్టి ఉనికి గమనించవచ్చు. దీని జీవిత చక్రం 30 నుంచి 40 రోజుల్లో ముగుస్తుంది.

పాటించాల్సిన పద్ధతులు

- వేసవిలో లోతు దుక్కులు దున్నడం వలన భూమిలో విశ్రాంత దశలో ఉన్న పురుగులు, కోశస్థ పురుగులను అదుపులో ఉంచవచ్చు. రైతులు సమష్టిగా ఒకేసారి విత్తుకోవడం పూర్తి చేయాలి.
- నత్రజని ఎరువులను అతిగా వాడరాదు. సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వాడాలి.
- పంట మార్పిడి విధానాన్ని పాటించాలి.
- ఎర పంటలుగా 100 ఆముదం మొక్కలు ఎకరం పొలంలో అక్కడక్కడ వేయాలి.
- 4–5 లింగాకర్షన బుట్టలను అమర్చాలి. వీటికి 50 మీటర్ల దూరానికి ఒక్కటి చొప్పున మొక్కల కంటే అడుగు ఎత్తులో అమర్చాలి.
- పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి ఎకరాకు 15–20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- పొలంలో బొరుగులు చల్లితే పక్షలు వాటిని తింటూ పురుగులను తింటాయి.
- గుడ్ల సముదాయాలు, పిల్ల లద్దె పురుగులు ఆకుల అడుగు భాగంలో గుంపులుగా ఉంటాయి. వాటిని ఆకులతో సహా ఏరి నాశనం చేయాలి.
- మొక్క దశను బట్టి గుడ్లను తొలి దశ పిల్లి పురుగులను నివారించడానికి ఐదు శాతం వేప గింజల ద్రవణాన్ని పిచికారి చేయాలి. దీని వలన తల్లి పురుగు మొక్కలపై తక్కువ గుడ్లు పెడతాయి.
- తొలిదశ పిల్ల పురుగులను అదుపులో ఉంచడానికి ఎన్‌పీవీ ద్రావణాన్ని 500 ఎల్‌ఈ చొప్పున కిలో బెల్లం, శాండోవిట్ కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి. దీంతో పురుగులు కొమ్మకు వేలాడి చనిపోతాయి.
- లద్దె పురుగులు పంట పొలం నుంచి మరో పొలంలోకి రాత్రి వేళల్లో వలస పోతాయి. కనుక పొలం చుట్టూ ఒక లోతు నాగలి చాలు కందకం చేసి అందులో ఫాలిడల్ పొడిని చల్లాలి. ప్రతి 70 మీటర్ల చాలుకు ఒక కిలో పొడి మందును వాడాలి.
- ప్రకృతిలోని మిత్ర పురుగులను పంట పెరుగుదలకు హాని చేసే పురుగుల ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని దృష్టిలో ఉంచుకుని మిగిలిన అన్ని పద్ధతుల ద్వారా పురుగులను అదుపులో ఉంచలేకపోయినప్పుడు మాత్రమే పురుగుల మందులు పిచికారీ చేయాలి.
- పురుగు మధ్యస్త దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా నోవాల్యూరాన్ ఒక ఎంఎల్ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. 50 శాతం పంటలో నష్టం గమనించినట్లయితే అయితే స్పైనోశాడ్ 0.3 ఎంఎల్ లేదా ఇయమెక్టిన్ బెంజోమెట్ 0.5 గ్రాములు లేదా లూఫెన్యురాన్ ఒక ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఎదిగిన లద్దె పురుగుల నివారణకు 5కిలోల తవుడు, 0.5 కిలో బెల్లం, 0.5 లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ తగినంత నీళ్లు కలిపి చిన్న ఉండలుగా చేసి మొక్కల మొదళ్లలో సాయంత్రం పూట చల్లుకోవాలి.
- విష ఎరలను తయారు చేసుకోలేని పక్షంలో క్లోరాన్‌ట్రానిప్రోల్ 0.3 ఎంఎల్ లేదా ఫ్లూబెండియమైడ్ 0.2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసి పెద్ద పురుగులను నివారించుకోవచ్చు.
- పొలంలో కిందపడిన ఎండు ఆకులను తీసి కాల్చివేయాలి.



గుడ్ల నుంచి పొదిగిన పొగాకు లద్దె పురుగులు

అవగాహనతోనే నివారణ

లద్దె పురుగు గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉంటే నివారణ సులభం అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచన చేస్తున్నారు. తల్లి పురుగు పెట్టిన గుడ్లు నాలుగైదు రోజుల్లో పొదిగి గొంగళి పురుగుగా మారుతుంది. తర్వాత బాగా ఎదిగిన గొంగళి పురుగుగా మారుతాయి. ఎదిగిన గొంగళి పురుగు ప్రధానంగా లేత గోధుమ రంగు కలిగి మెడ మీద ప్రముఖంగా కనిపించే నల్లటి మచ్చలతో శరీరమంతా సన్నటి లేత రంగు గీతలు కలిగి ఉంటాయి. కోశస్థ దశ మొక్కలకు దగ్గరగా భూమిలో గడుపుతుంది.

65 దాటితే రిటైరే..!

▶ మొదటి పేజీ తరువాయి

అంగన్‌వాడీ కేంద్రాలు, మరో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా.. ప్రధాన కేంద్రాల్లో టీచర్‌తో పాటు హెల్పర్ కూడా ఉంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 55,450 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో ఉన్నారు. వీరిలో ఐదు శాతం మంది పదవీ విరమణకు దగ్గర్లో ఉండగా.. మరో రెండున్నర వేల మందికి పైగా 65 సంవత్సరాలకు పైబడినవారున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వీరికి రిటైర్మెంట్ ఇచ్చేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రెండు రకాల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచింది. పదవీ విరమణ పొందే టీచర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్, కారుణ్య నియామకం కింద కుటుంబీకులకు అవకాశం ఇచ్చేలా ఒక ప్యాకేజీ తయారు చేసింది. అదే విధంగా రూ.2 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్ ఇచ్చే అంశాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్న ఆర్థిక భారం తదితరాలపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వద్ద మంత్రి సత్యవతి రాథోడ్, సంబంధిత అధికారులు ఇప్పటికే సుదీర్ఘంగా చర్చించారు. ఆయన ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో పదవీ విరమణపై స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మినీ అంగన్‌వాడీలు లేనట్లే..

రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లోమినీ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలనేది కూడా ఒకటి. దీంతో వీటన్నింటినీ అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయితే ఆ మేరకు హెల్పర్ పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాల్సి ఉంది. దీనిపై కూడా శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందిస్తోందని, అతి త్వరలో ప్రభుత్వ నిర్ణయం కూడా వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

మధ్యవర్తిత్వంతో కోర్టులపై భారం తగ్గింపు

- విపరీత ఒత్తిడి ఏ వ్యవస్థకూ మంచిది కాదు
- ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై
- మధ్యవర్తిత్వ వ్యవస్థ పటిష్టం కావాలి: హైకోర్టు సీజే ఉజ్జల్ భూయాన్



ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా వ్యవస్థపై అది భరించే శక్తికి మించి ఒత్తిడి పెంచితే ఆ వ్యవస్థ దెబ్బతింటుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ భారాన్ని తగ్గించడం 'మధ్యవర్తిత్వం'తోనే సాధ్యమని తెలిపారు. ఇంట్లోని చిన్న చిన్న తగాదాలు కూడా కోర్టుకు చేరడంతో పెండింగ్ కేసులు అంతకంతకూ పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి కేసులన్నీ మధ్యవర్తిత్వంతోనే పరిష్కారం కావాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ-మీడియేషన్ రైటింగ్స్ (ఈఎండబ్ల్యూ) ఏర్పాటై మూడేళ్లయిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గవర్నర్ తమిళిసై హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈఎండబ్ల్యూ మూడేళ్ల విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. 'అత్తాకోడలు, భార్యాభర్తలు, అన్నదమ్ములు.. ఇలా చిన్నచిన్న వివాదాలను ఇంటి స్థాయిలోనో లేదా గ్రామ స్థాయిలోనో ఎవరో ఒకరు మధ్యవర్తిత్వంతో పరిష్కరించే ఏర్పాట్లు జరగాలి. పేదలకు కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే ఆర్థిక స్తోమత తక్కువ. అలాంటి వారి సమస్యల పరిష్కారం కోసం మధ్యవర్తులు ముందుకురావాలి'అని తమిళిసై పిలుపునిచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందన్నారు. భరించే శక్తికి మించి న్యాయవ్యవస్థ భారం మోస్తోందని చెప్పారు. గతంలో గ్రామీణ స్థాయిలో, కుటుంబాల్లో ఉన్న మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని, సత్వర న్యాయం అందుతుందన్నారు. కోర్టు తీర్పు తర్వాత సదరు పార్టీల మధ్య బంధం ఉండకపోవచ్చని, అదే మధ్యవర్తిత్వ పరిష్కారంలో వారి అంగీకారంతోపాటు బంధం బలహీనపడదని చెప్పారు. మీడియేటర్ల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉందని, అది పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

ఇరు పార్టీలకు సమ న్యాయం..

కోర్టుల్లో వివాదాల పరిష్కారంతో పోలిస్తే మధ్యవర్తిత్వ పరిష్కారం అన్నివిధాలా ఉత్తమమైనదని పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో పార్టీలు ఇద్దరూ సఫలీకృతం అవుతారని, ఇద్దరికీ సమ న్యాయం అందుతుందని చెప్పారు. ఇంట్లో, ఊరిలో, సమాజంలో మధ్యవర్తులు ఉండి ఎక్కడికక్కడే సమస్యలకు చెక్ పెడితే అది సమాజ పురోభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. ప్రపంచమంతా అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్న కోవిడ్ సమయంలో ఈఎండబ్ల్యూ ఊపిరిపోసుకుందని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి తెలిపారు. ప్రత్యక్ష కోర్టులు లేని సమయంలో కక్షిదారులకు సేవలందించిందని, ఇలా మూడేళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. మధ్యవర్తిత్వం కోసం.. మధ్యవర్తిత్వం చేత.. మీడియేటర్లే నిర్వహిస్తున్న కార్యక్రమం ఈఎండబ్ల్యూ అని మీడియేషన్ ట్రైనర్ పుష్ప గుప్తా అన్నారు. అనంతరం మీడియేషన్ ట్రైనర్ ధన్కచన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సైనిక బలగాల ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ రాజేంద్ర మీనన్, పలు రాష్ట్రాల న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఈఎండబ్ల్యూ తెలంగాణ కో-ఆర్డినేటర్ మంజీరా వెంకటేశ్, కేఎస్ శర్మ, చిత్రా నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ప్రయాణికుల పాట్లు

సికింద్రాబాద్: ఒడిశాలో జరిగిన భారీ రైలు ప్రమాదం కారణంతో ఆదివారం కూడా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. పలు రైళ్లు దారిమళ్లించడం, మరికొన్ని రైళ్లు రద్దు కావడంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. సికింద్రాబాద్-గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం రైళ్లన్నీ కొద్దిగంటల తేడాతో బయలుదేరి వెళ్లగా సాయంత్రం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్లాల్సిన విజయవాడ, భద్రాచలం రైళ్లను రద్దు చేశారు. దీంతో రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక సహాయక కౌంటర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు సమాచారం అందించారు.

మీరాకుమార్‌ని కలిసే టైం కేసీఆర్‌కు లేదా?

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను మర్యాదపూర్వకంగా కూడా కలిసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నించకపోవడం ఆయన సంకుచిత బుద్ధికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు.

553 మంది క్షేమం

- రెండు రైళ్లలో ఏపీ రాష్ట్రానికి చెందినవారు 696
- ప్రయాణాన్ని రద్దు చేసుకున్న వారు 92
- 22 మందికి గాయాలు, ఒకరు మృత్యువాత
- మరో 28 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాద ఘటనలో ఏపీకి చెందిన 553 మంది క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడ్డారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో 485 మంది, యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది వెరసి 696 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 92 మంది ప్రయాణించలేదని చెప్పారు. మిగతా వారిలో 553 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, 21 మంది స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి మృత్యువాత పడ్డారన్నారు. మిగతా 28 మంది ప్రయాణికుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. వారి మొబైల్ నంబర్ల ఆధారంగా చిరునామా తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ప్రయత్నిస్తోందని తెలిపారు.


ప్రమాద బాధితుడు సత్యంకు చెక్కును అందిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కల్యాణి


రైలు ప్రమాదంలో ఏపీ బాధితులకు పరిహారం

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు

సాక్షి, అమరావతి : ఒడిశా రైలు ప్రమాదంలో ఏపీకి చెందిన బాధితులందరికీ పరిహారం ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైలు ప్రమాద దుర్ఘటన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆదివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖపట్నంలో మరో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణించి ఉంటే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయానికి ఇది అదనం అని స్పష్టం చేశారు. బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మరణించారని, ఇది తప్ప రాష్ట్రానికి చెందిన వారెవరూ ఈ ఘటనలో మరణించినట్టుగా ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు. గాయపడ్డ వారికి మంచి వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేపటి నుంచి అధిక ఉష్ణోగ్రతలు

మహదేవ్‌పూర్‌లో 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత ● నేడు కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ అంతటా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, రాష్ట్రంలో ఆదివారం కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో ఆదివారం అత్యధికంగా 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం ఒక్క రోజు మాత్రం రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా దక్షిణ ఛత్తీస్‌ఘడ్ పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతూ ఉంది.

ఆదివారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలివీ...

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత		
మహదేవ్‌పూర్ (జయశంకర్)	45.5	ఆదిలాబాద్	41.8
ముత్తారం (పెద్దపల్లి)	45.1	భద్రాచలం	43.0
జంబుగ (కొమురంభీం)	45.0	హన్మకొండ	41.5
బయ్యారం (మహబూబాబాద్)	44.9	హైదరాబాద్	38.1
ఖానాపూర్ (ఖమ్మం)	44.8	ఖమ్మం	43.0
సుజాతనగర్ (భద్రాద్రి కొత్తగూడెం)	44.8	మహబూబ్‌నగర్	36.6
కట్కూరు (సిద్దిపేట)	44.7	మెదక్	41.8
కల్వచెర్ల (పెద్దపల్లి)	44.7	నల్లగొండ	38.5
బాణాపురం (ఖమ్మం)	44.6	నిజామాబాద్	42.4
		రామగుండం	42.4

ఏరువాక.. సాగాలిక

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఆదివారం ఏరువాక పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయమే రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి తీపివంటలు పెట్టారు. అలాగే వ్యవసాయ పనులను ప్రారంభించారు. సాయంత్రం గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలుగా వించి మొక్కులు తీర్చుకున్నారు. కొన్నిచోట్ల ఏరువాక తాడును తెంపేందుకు రైతులు ఎద్దులతో పోటీపడ్డారు. – సాక్షి నెట్‌వర్క్


ధన్వాడ మండలం లక్ష్మీవాడలో ఏరువాక తాడును ఎద్దులతో తెంపుతున్న గ్రామస్తులు


నారాయణపేట మండలం తిర్మలాపూర్‌లో ఎద్దులతో రైతుల ఊరేగింపు..


కొకుంట్లలో ఎద్దుకు పూజలు చేస్తున్న సర్పంచ్ స్వప్న


కొకుంట్లలో ఏరువాక పండుగలో పాల్గొన్న గ్రామస్తులు


నవాబుపేటలో పొలం పనులు ప్రారంభిస్తున్న రైతులు


మరికల్ మండల కేంద్రంలో..


గట్టు మండల కేంద్రంలో..


మద్దూరులో ఏరువాక తాడును తెంపుతూ..

కల్యాణం.. కమనీయం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మన్యంకొండలో వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గర్భగుడి నుంచి ఆలయ సమీపంలోని మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఊరేగింపు ముందుకు కదిలింది. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం, మంగళసూత్ర ధారణ, తలంబ్రాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరిగి పల్లకీలో గర్భగుడికి తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పూలు, బంగారు ఆభరణాల అలంకరణలో స్వామి, అమ్మవార్లు భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, అర్చకులు పాల్గొన్నారు.


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు



కందనూలు: పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు ప్రవచనాలు పట్టణవాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి జిల్లాకేంద్రంలో జ్ఞానేశ్వర సేవా ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో యువత సామాజిక స్పృహ అనే అంశంపై గరికపాటి మాట్లాడారు. దారితప్పుతున్న యువత, కుటుంబ సంబంధాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలు హిందూ సంఘాలతో పాటు, పెద్దసంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి


అమ్మవారికి హారతి ఇస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి

బాలానగర్: దేశంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెన్నంగులగడ్డతండా ఎక్వాయపల్లిలో రాజశ్యామల మహాయాగం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజశ్యామలదేవికి ప్రియభక్తుడు అయిన కాంతారెడ్డి పిలుపుతో ఇక్కడ అమ్మవారి యాగం నిర్వహిస్తున్నామని అన్నారు. ఇరురాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యాటకులు భయపడాల్సిన అవసరం లేదు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: పులులు ఉన్నాయనే ఆందోళన అవసరం లేదని, పర్యాటకులు ఎలాంటి సంకోచం లేకుండా కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌ను సందర్శించవచ్చునని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జంగిల్ ఫారెస్ట్‌లో చిరుతపులి సంచరించిన వాచ్ టవర్ ఏరియాను ఆదివారం మంత్రి పరిశీలించారు. కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌ను అనుకుని ఉన్న 26వేల ఎకరాల అడవిలో అనేక వన్యప్రాణులు ఉన్నాయని తెలిపారు. అయితే అక్కడ వాటికి అవసరం అయిన ఆహారం, నీరు సమృద్ధిగా ఉండటం వల్ల వేరే ప్రాంతానికి జంతువులు వెళ్లే పరిస్థితి లేదని అటవీ శాఖ అధికారులు తెలిపారని అన్నారు. ఇక్కడ 12 చిరుతలు, అనేక జింకలు, కుందేళ్లు, ఎలుగుబంట్లు, అడవిదున్నలు, నెమళ్లు, ఇతర వన్యప్రాణులు ఉన్నాయని తెలిపారు. ఈ పార్క్‌లో ఏటా 50లక్షల సీడ్ బాల్స్ వెదజల్లామని, గత ఏడాది 1.30కోట్ల సీడ్ బాల్స్ వేసినట్లు తెలిపారు. జంతువులకు సోలార్ పంపుల ఏర్పాటు చేసి తాగునీరు కల్పించినట్లు తెలిపారు.

ఉనికి కోసమే భట్టి పాదయాత్ర

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు విమర్శ

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ పార్టీ ఉనికి కోసం పాదయాత్రలు చేసినా ఒరిగేదేమీ లేదని, ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే పాదయాత్ర చేస్తున్నారని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఉనికి కోసమే పాదయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలో నేనున్నానని చెప్పుకోవడానికి, సీఎం పదవి పోటీకి మాత్రమే పాదయాత్ర చేస్తున్నారని, దీంతో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. సీఎం కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం సరైంది కాదని, పీసీసీ అధ్యక్షుడి పదవికి పోటీ నిలబడటం కోసమే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో భట్టికి సముచిత స్థానం లేక, నిరూపించుకోవడానికి ఇతరులపై బురద జల్లే మాటలు సరైనవి కావన్నారు. మీ పార్టీలోని అధినాయకత్వానికి చెప్పుకోవాలే తప్ప లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.


అచ్చంపేటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

నోటుకు ఓటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి అమెరికాలో నిధుల కోసం వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయించలేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా 25 ఏళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని, తమ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి జరగడం లేదన్నారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ చైర్మన్ తులసీరాం, రమేష్‌రావు, శంకర్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.